క్లుప్తంగా

మంత్రి అంబటి నివాళి

సత్తెనపల్లి: పట్టణంలోని 10వ వార్డుకు చెందిన గుండెగాని సీతమ్మ(80) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆ వార్డు కౌన్సిలర్ పెద్దింటి గోవిందమ్మ వెంకటేశ్వర్లు విషయం మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సోమవారం సీతమ్మ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, పెద్దింటి వెంకటేశ్వర్లు(చిట్టి), తదితరులు ఉన్నారు.

ఆరు దుకాణాలపై కేసులు నమోదు



క్రోసూరు: మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ సత్తెనపల్లి ఇన్స్పెక్టర్ షేక్ జాన్ సైదా తనిఖీ సోమవారం తనిఖీలు చేపట్టారు. తూనికల్లో తేడాలు గుర్తించిన ఆరు షాపులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కోట ప్రభాకరరావు దుకాణం, నాలుగు రోడ్ల సెంటర్‌లోని రెండు బేకరీలు, చేపలు విక్రయించే వారి వద్ద తూనికల్లో మోసాలు జరుగుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు.

రేపు చాగంటివారిపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఈ నెల 6న శంకరకంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని శ్రీజగన్నాథస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏఎస్‌కేవీ రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని శ్రీజగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు వెంట తీసుకొని రావాలని కోరారు.

భార్గవశర్మకు ఉత్తమ పండిత పురస్కారం



సత్తెనపల్లి: హిందూ ధర్మ పరిరక్షణ సేవలను గుర్తించి మండలం పెద్దమక్కెన గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయ అర్చకుడు దాములూరి భార్గవ శర్మకు ఉత్తమ పండిత పురస్కారాన్ని శైవాగమ విద్వాన్ అనే బిరుదును సర్ సీవీ రామన్ అకాడమీ.. ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని హరిహర కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భార్గవ్ శర్మను సువర్ణ కంకణం, సువర్ణ పతకంతో సత్కరించారు. ఈ సందర్భంగా దాములూరి భార్గవ్ శర్మను సోమవారం పలువురు అర్చకులు ప్రత్యేకంగా అభినందించారు.

98శాతం పల్స్ పోలియో చుక్కలు

సత్తెనపల్లి: మండలంలోని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 10,453 గృహాలను వైద్య సిబ్బంది సందర్శించి సోమవారం 133 మంది ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మొత్తంగా 98 శాతం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆరోగ్య విస్తరణాధికారి పిట్టల శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కూడా ఇంటింటికి పర్యటించి పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్య శాలలోని ఓపీ వద్ద, ప్రసూతి వార్డు దగ్గర మినరల్ వాటర్ మినీ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును సోమవారం వైద్యశాల అభివృద్ధి కమిటీ డాక్టర్ కొత్త రామకృష్ణ ప్రారంభించి, మాట్లాడారు. ఇందుకు స్పందించి సహకరించిన డాక్టర్ వద్దుల యామినికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరొక మినీ ఆరో ప్లాంట్ త్వరలోనే ఏర్పాటు చేస్తానని, దీంతో వైద్యశాలలో మంచి నీటి కొరత తీరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, మెడికల్ సూపర్వైజర్ విజయలక్ష్మి, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్ భవాని, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్ నర్స్ వెంకటేశ్వరమ్మ, బంగారు పాప, యూడీసీ నరేంద్ర, జీడీఏ గోపి, శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు భవిష్యత్తుకే గ్యారంటీ లేదు..

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పట్టణం, రెండు మండలాల బూత్ కన్వీనర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: 'టీడీపీ అధినేత చంద్రబాబు మీ భవిష్యత్‌కు గ్యారంటీ నాది అని చెబుతున్నాడు. ఆయన భవిష్యత్‌కే గ్యారెంటీ లేదు. ఇక మన భవిష్యత్‌కు ఏం గ్యారంటీ ఇస్తాడు' అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సత్తెనపల్లి పట్టణం, రూరల్, ముప్పాళ్ళ మండలాల పోలింగ్ బూత్ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పోలింగ్ బూత్ స్థాయిలో ప్రతి ఓటరుపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వారికి తెలియజేయాలన్నారు. ప్రతిపక్షం నుంచి తీసుకువచ్చే ఒక్క ఓటు రెండు ఓట్లతో సమానం అనేది గుర్తుపెట్టుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న విభేదాలను వీడి ఐక్యంగా పనిచేయాలని మంత్రి అంబటి సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ. 2.75 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు. ఇంత పారదర్శకంగా సంక్షేమాన్ని ఏ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, ముప్పాళ్ళ మండల అధ్యక్షుడు నక్కా శ్రీనివాసరావు, ఎంజెఎం రామలింగారెడ్డి, జెసీఎస్ ఇన్‌చార్జ్‌లు కొణతం స్వాతి , బొంతు వెంకటరెడ్డి , రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ మండలాల్లోని పోలింగ్ బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

మీ వెంటే ఉంటా ఆశీర్వదించండి

అచ్చంపేటలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటన



పడమర ముస్లిం బజారులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: 'మీకే కష్టమొచ్చినా మీతోనే ఉంటా.. మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తా... అర్హత ఉండి కూడా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే చెప్పండి. అధికారులతో మాట్లాడి ఇప్పిస్తా..' అంటూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం ఉదయం అచ్చంపేటలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చినమాట నిలబెట్టుకున్నామనే ధైర్యంతో ఇంటింటికీ రాగలుగుతున్నానని అన్నారు. మంచి జరిగిందనుకుంటేనే ఫ్యాను గుర్తుపై ఓటేయాలని చెప్పారు. అచ్చంపేటలో రూ.40 కోట్లు సంక్షేమ పథకాలు రూపంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు చెప్పారు. రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేసి, మరో రూ.20 కోట్లతో జగనన్న కాలనీలో 700 ఇళ్ల స్థలాలిచ్చి, సౌకర్యాలన్ని కల్పించినట్లు చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు నూతన భవనం, జెడ్పీ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో రూ.1.85 కోట్లతో రెండు అదనపు తరగతుల భవనాలను నిర్మించినట్లు ఎమ్మెల్యే నంబూరు తెలిపారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియట్ కోర్సుకు ప్రత్యేకంగా రూ.1.80కోట్లతో నూతన భవనం నిర్మించామన్నారు. ఇంకా జల జీవన్ మిషన్ ద్వారా రూ.60లక్షలతో ఇంటింటికి కొళాయిలు తాగునీరు ప్రయత్నం చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం, పులిచింతల ప్రాజెక్టు నుంచి బ్యాక్ వాటర్‌ను కాలువల ద్వారా సేద్యానికి ఇచ్చే ప్రయత్నం చేస్తున్నానని, వీటిలో కనీసం 10 శాతమైన గత ప్రభుత్వాలు ఇచ్చాయా అని అడిగారు. అచ్చంపేటలోని రాజీవ్‌నగర్ కాలనీ, తూర్పు ముస్లిమ్ బజారు, అమరావతి రోడ్డు, పడమర ముస్లిమ్ బజారు, చామర్రు రోడ్డు, మెయిన్ రోడ్డులోని ప్రతి ఇంటికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తిరిగారు. పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, టౌన్ పార్టీ కన్వీనర్ సమరం, ఆర్యవైశ్య నాయకులు అన్నవరపు శ్రీనివాసరావు, గాదె వీరాంజనేయులు, రైతు గోపి, సందెపోగు లక్ష్మణబాబు, సందెపోగు పున్నారావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండ

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ దివ్యాంగులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఆయన తనయుడు నంబూరు కల్యాణ చక్రవర్తి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర దివ్యాంగుల పట్ల ఎంత అభిమానం చూపిస్తారో.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరుశంకరరావు అంతే అండగా నిలుస్తారన్నారు. ఎటువంటి అసరమున్నా దివ్యాంగులు ఎమ్మెల్యేకు ఫోను చేసి చెప్పవచ్చునన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు జగనన్న సిద్ధం సభకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు వాల్ పోస్టర్లు పట్టుకుని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నలుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేసారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వెలది అప్పారావు, షేక్ గఫూర్, సొసైటీ అధ్యక్షుడు కోటిరెడ్డి, పట్టీల శ్రీనివాసరావు, నారు శ్రీనివాసరెడ్డి, దివ్యాంగుల సంఘం ప్రతినిధి జెర్రిపోతు చంద్రశేఖర్, వంద మంది దివ్యాంగులు పాల్గొన్నారు.

వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలో 17 వార్డు వలంటీర్ల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రంగా కాలనీలో -5, క్రిస్టియన్ పేట-1, మార్కెట్ యార్డ్ ఏరియా -2, భవిరిశెట్టి వారి వీధి -1, ఓల్డ్ సాలిపేట -1, వెంకటపతి నగర్‌లో -2, శాలివాహన నగర్‌లో -1, వడ్డవల్లి ఏరియా -2, వెంగళరెడ్డి నగర్‌లో -2 వార్డు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదో తరగతి లేదా తత్సమా పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, పదో తరగతి సర్టిఫికెట్‌లో పుట్టిన తేదీ ఒకటే ఉండాలని తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో నివాసితులై, 2024 ఫిబ్రవరి 10 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారై 35 సంవత్సరాలు దాటని వారై ఉండాలన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. మంగళవారంలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6న దరఖాస్తుల పరిశీలన, 7న మౌఖిక పరీక్ష, అదేరోజు వలంటీర్లుగా ఎంపికైన వారి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ నెల 8 నుంచి వలంటీర్లు పని చేయుట ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు కార్యాలయం లేదా మున్సిపల్ మేనేజర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నేడు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

క్రోసూరు: మండలంలో జగనన్న ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు మంగళవారం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ల(కన్వేయన్స్ డీడ్స్)ను ఎమ్మెల్యే నంబూరు శంకరావు అందజేస్తారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు క్రోసూరు వైఎస్సార్సీపీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా సైన్స్ ఫేర్

పిడుగురాళ్ల: నిత్య జీవితంలో విజ్ఞాన శాస్త్రం ఎంతో ముఖ్యమని గీతిక సీబీఎస్‌ఈ స్కూల్ చైర్మన్ టి.బాల గంగాధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో ఉన్న గీతిక సీబీఎస్‌ఈ స్కూల్లో సోమవారం సైన్స్ ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి మానవాభివృద్ధిపై సైన్స్ ప్రభావం ఎంతో ఉందని, అది మన జీవితంలో భాగమైందన్నారు. సైన్సులో ముందున్న దేశాలన్ని అభివృద్ధి దశలో ఉన్నాయని చెప్పారు. సైన్స్‌లో ఎన్నో నూతన ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అన్నారు. విద్యర్థులు తయారు చేసిన ప్రయోగాత్మక నూతన ఆవిష్కరణలు పలువురిని ఆకర్షించాయి. విద్యార్థులను చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టి.పద్మశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

వెల్దుర్తి: కల్లంలో మిర్చికి కాపలా కాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని టాటా మ్యాక్స్ ఢీ కొట్టడంతో మండలంలోని మండాది గ్రామానికి చెందిన శీలం శివారెడ్డి (50), శీలం కోటిరెడ్డి (35)లు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాచర్ల నుంచి శిరిగిరిపాడు వైపు వెళ్లే వాహనం ఢీ కొట్టడంతో వారు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామంలో నుంచి జాతీయ రహదారి దాటుతుండటంతో వేగంగా వస్తున్న టాటా మ్యాక్స్ ఢీ కొట్టడంతో మృతి చెందారు. కోటిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. శివారెడ్డికి కుమార్తె ఉంది. ప్రమాద వార్త తెలుసుకున్న మండాది గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి



చిలకలూరిపేట: ఏపీ గురుకుల విద్యాలయ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కె.లక్ష్మి కోరారు. పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఏపీ ఆర్‌ఈఐఎస్ (ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ) పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురు కుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశంతో పాటు 6,7,8 తరగతులలో ఖాళీలను పూరించేందుకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నా రు. వీటితో పాటుగా ఏపీ ఆర్‌జేసీలో ఇంటర్మీడియెట్, ఏపీడీసీలో డిగ్రీ ప్రవేశానికి ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ నెల 31తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజాపేట ఏపీ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరాల సర్వే



ఇంటింటా జ్వరాల సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

దొడ్లేరు(క్రోసూరు): ఇంటింటా ప్రజలు జ్వరాలు బారిన పడి ఉన్నారని, ప్రభుత్వం వెంటనే వైద్యం అందించాలని వచ్చిన వార్తలపై దొడ్లేరు సెక్టర్ వైద్యులు డాక్టర్ మహమ్మద్ సాద్ సోమవారం స్పందించారు. జ్వరాలు ఉన్న సమాచారం తమ దృష్టికి వచ్చిందని, అప్పటి నుంచి ఇంటింటా జ్వర సర్వే చేయించామని, వైద్యం కూడా అందిస్తున్నామని తెలిపారు. గుడిపాడులో ప్రస్తుతం జ్వరాలు లేవన్నారు. అదేవిధంగా గరికపాడు, గాదెవారిపాలెంలో ముగ్గురికి మాత్రమే జ్వరాలున్నాయని చెప్పారు. పదిరోజుల క్రితం వైరల్ జ్వరాల బారిన పడ్డవారు పది మంది ఉన్నారని.. వారికి ఇప్పటికీ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కాళ్లుచేతులు పట్టుకుపోతున్న సమాచారంపై స్వయంగా రోగుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల్లో వీధుల్లో దోమల నివారణ మందు పిచికారి, ఫాగింగ్, పారిశుద్ధ్య పనులు చేపట్టామని, జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. జ్వరాలుంటే స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు చెప్పవచ్చునని, వీలైతే సెక్టార్ డాక్టర్ దృష్టికి తీసుకొనిరావచ్చునన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రమణయ్య

ముప్పాళ్ళ: అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ డాక్టర్ పుట్టా రమణయ్య అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. రమణయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నూరు శాతం ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలన్నారు. గ్రామాల వారీగా పెండింగ్ బకాయిలపై సమీక్ష చేశారు. గ్రామాల్లో పనిచేసే క్లాప్ మిత్ర జీతాలను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సఫాయి మిత్ర వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, 15వ ఆర్థిక సంఘం నిధులు వాడకంపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ ఎస్.రూపవతి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వద్దు

ఎంపీడీవో కవితా చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కవితాచౌదరి

శావల్యాపురం: వేసవిలో అన్నీ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కవితా చౌదరి మాట్లాడుతూ ఈఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఈక్రమంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారుల ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈనెలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగర్ జలాలు విడుదలవుతాయని, మంచినీటి చెరువులను నింపడానికి క్షేత్రస్థాయిలో తగుచర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో 403 చేతి పంపులు ఉన్నాయని అన్నీ పనిచేసేలా పర్యవేక్షణ చేయాలని ఏమైనా మరమ్మతులకు గురైతే చేతి పంపులు మెటీరియల్ సిద్ధంగా ఉందని లిఖిత పూర్వకంగా తెలియజేస్తే సత్వరమే మరమ్మతులు చేయించటానికి సిద్ధంగా ఉండాలన్నారు. తాగునీటి విషయంలో ఫిర్యాదులకు తావులేకుండా అన్నీ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు తీరు ఆన్‌లైన్ విధానం వంటి పనులన్నీ పాదర్శకంగా చేయాలన్నారు. ఈసమావేశంలో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఆర్‌డబ్ల్యూఏస్ ఏఈ మూఢవత్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమ పరిశీలన



చిన్నారుల వేలుపై సిరా మార్కు పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి కోటేశ్వరరావు

చిలకలూరిపేట: పల్స్ పోలియో నిర్వహించిన తీరుపై పరిశీలన కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి కె.కోటేశ్వరరావు సోమవారం నిర్వహించారు. మండలంలోని బొప్పూడి, తాతపూడి గ్రామాలలో పర్యటించి ఇంటింటి డోర్‌మార్క్ కార్యక్రమం నిర్వహించారు.
ఇందులో భాగంగా ఇళ్లకు వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పోలియో చుక్కలు వేశారా లేదా అన్న దానిపై పిల్లల ఎడమచేతి చిటికెన వేలుపై సిరా మార్కు ఉన్నదా లేదా అని పరిశీలించారు. పల్స్ పోలియో నిర్వహించిన తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నీలం రామకోటేశ్వరరావు, డాక్టర్ పి హరిహరన్,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమ వారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్స వాల్లో తొలి రోజున మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొని స్వామి వారికి అభిషేక సేవలను అందజేశారు. మంగళవారం ఇదే ఆలయంలోని ప్రసన్నాంజనేయస్వామి వారికి అభిషేక పూజలు, నాగవల్లీ దళార్చనా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమ్మేళనం

హాజరుకానున్న నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్ యాదవ్

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ హాజరౌతారని వెల్లడించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ముందుగా పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయానికి ఉదయం 9 గంటలకు చేరుకుని అక్కడి నుంచి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికి ర్యాలీగా ఆర్యవైశ్య కల్యాణ మండపానికి చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వివిధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు లంకెలకూరపాడులో అభివృద్ధి పనులు ప్రారంభం



హెల్త్ వెల్‌నెస్ సెంటర్



గోదాము

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): లంకెలకూరపాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ మోర్తాల వెంకటరమణారెడ్డి తెలిపారు. గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గాను రూ.36లక్షలతో ఆరోగ్య ఉప కేంద్రం, 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును రూ.43.90లక్షలతో నిర్మించారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

రేషన్ బియ్యం సద్వినియోగం చేసుకోండి



అప్పాపురంలో రేషన్‌వాహనం వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వరకుమార్

నాదెండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డీవీబీ వరకుమార్ చెప్పారు. మండలంలోని అప్పాపురం గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించారు. రేషన్‌కార్డులో ఉన్న సభ్యుల ప్రాతిపదికన ఒక్కొక్కరికీ 5 కేజీల చొప్పున ఉచితంగా అందించాలని, ఏఏవై కార్డులకు 35 కేజీల బియ్యం అందించాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి కేజీ కందిపప్పు రూ.67లకు, అరకేజీ పంచదార రూ.17లకు అందించాలన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ ప్రతి ఇంటికీ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేయాలన్నారు. పంపిణీని సక్రమంగా చేయాలని, లబ్దిదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మండలంలోని సంకురాత్రిపాడు, జంగాలపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం స్థానిక వీఆర్వోలతో కలిసి తహసీల్దార్ డీవీబీ వరకుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులను పరిశీలించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక వీఆర్వోలను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. మండల పరిధిలో మొత్తం 57 పోలింగ్ కేంద్రాలున్నాయని, సంకురాత్రిపాడులో 2, జంగాలపల్లెలో 1 కేంద్రాలను పరిశీలించారు. వారితో పాటూ ఆర్ఐ రమీజా, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గొరిజవోలులో...

మండలంలోని గొరిజవోలు గ్రామానికి చెందిన కందుల కాశిరెడ్డి భార్య హైమావతి ఇరవై ఏళ్ళ క్రిందట యకరం పొలంలో టేకు మొక్కలు నాటామని, ప్రస్తుతం వీటిని విక్రయించేందుకు అనుమతి కావాలని తహసీల్దార్‌కు అర్జీని అందించారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ వరకుమార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి టేకు మొక్కలు పరిశీలించారు. వారితో పాటూ వీఆర్వో అశోక్ ఉన్నారు.

భూమిని పరిశీలించిన ఆర్డీవో సరోజిని



భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ వరకుమార్

నాదెండ్ల: గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని నూతన మార్కెట్ యార్డు పక్కనే ఉన్న భూమిని నరసరావుపేట ఆర్డీవో పి.సరోజిని రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. సర్వే నెంబర్ 513-ఎ, 514-ఎలో కొమ్మినేని శోభారాణి, మక్కెన వంశీకృష్ణలకు చెందిన 73 సెంట్లు భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేశారు. ఇందులో పెట్రోల్ బంకు నిర్మాణం చేసేందుకు ఎన్‌వోసీ జారీ చేయమని భూయజమానులు కోరడంతో సోమవారం ఆ భూమిని ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ డీవీబీ వరకుమార్, సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, ఆర్ఐ షేక్ రమీజాలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో సాంబశివరావు, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.